

రోడ్డు పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

బస్ నడుపుతుండగా డ్రైవరుకు గుండెపోటు



రాఘవయ్య (ఫైల్ ఫొటో)

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- కండక్టర్ అప్రమత్తత ప్రయాణికుడికి తప్పిన ముప్పు



మృతుడి కుటుంబీకులను ఓదారుస్తున్న ఆర్టీసీ అధికారి వెంకటేశ్వరరావు

కల్లూరు, జూలై 4: రాత్రి 9 గంటలు.. కల్లూరుకు ఆర్టీసీ బస్సు వస్తోంది. అదే సమయంలో బస్ డ్రైవరుకు గుండె నొప్పి వచ్చింది. కొద్ది క్షణాలకే తీవ్రమైంది. అప్పటికే చేతిలో స్టీరింగ్ అదుపు తప్పింది. బస్సు రోడ్డు పక్క గుంతలోకి ఒరిగి పోయింది. కండక్టర్ వెంటనే అప్రమత్తమై బస్‌ను నియంత్రించారు. ఆస్పత్రికి తరలించినా డ్రైవరు ప్రాణాలు దక్కలేదు. వివరాలివి.. తిరుపతి నుంచి కొత్తపేట మీదుగా కల్లూరుకు బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు బయలుదేరింది. కల్లూరు నైట్ హాల్ట్ కావడంతో బస్సులో ఒక ప్రయాణికుడు మాత్రమే ఉన్నారు. పులిచెర్ల మండలం కొక్కువారిపల్లి సమీపానికి వచ్చేసరికి డ్రైవర్ రాఘవయ్య(56)కు గుండెపోటు వచ్చింది. బస్సును నియంత్రించడం సాధ్యం కాలేదు. బస్సు రోడ్డు పక్కనున్న గుంతలోకి ఒరిగిపోయింది. కండక్టర్ మణి పరిస్థితి గుర్తించారు. హుటాహుటిన ప్రయాణికుడితో కలసి డ్రైవర్‌ను కిందకు దింపారు. అటుగా వెళుతున్న కారును ఆపి పులిచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి రాఘవయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రాఘవయ్య మృతదేహాన్ని స్వగ్రామం సోమల మండలం పొదలగుంటపల్లికి తరలించారు. ప్రజా రవాణా సంస్థ జోనల్ కార్యనిర్వహణ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథరెడ్డి, పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య, సిబ్బంది సందర్శించి రాఘవయ్యకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. సంస్థ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



ఇచ్చిందే మెనూ.. పెట్టిందే తిను!

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఇదీ పరిస్థితి

- పలచటి పప్పు, నీళ్ల మజ్జిగే దిక్కు
- హోటళ్ల నుంచి తెచ్చుకుంటున్న రోగులు

ఇక్కడ పెట్టిన అన్నం తింటే వాంతులు అవుతున్నాయి. ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, రసం, మజ్జిగ అందిస్తున్నారు. ఇవి అస్సలు బాగోలేదు.

- గత నెల 19న చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ఓ రోగి చేసిన ఫిర్యాదు ఇది.

ఆ సమయంలో అక్కడ వడ్డిస్తున్న భోజనాన్ని ఎమ్మెల్యే చూశారు. నాణ్యతగా లేకపోవడంతో నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా, 15 రోజులవుతున్నా అదే పరిస్థితి. భోజన నాణ్యతలో మార్పు రాలేదని రోగులు వాపోతున్నారు.

- చిత్తూరు రూరల్



గత నెల 19వ తేదీన రోగులకు వడ్డించే అన్నాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందించే ఆహారంలో నాణ్యతతో పాటు మెనూ పాటించడం లేదు. మెనూలో ఒకటి ఉంటే మరొకటి అందిస్తున్నారు. తాము ఇచ్చిందే మెనూ.. పెట్టింది తిను అన్నట్లుగా కాంట్రాక్టరుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ప్రధాన ప్రభుత్వాస్పత్రిలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీతో పాటు మాతా శిశు ఆరోగ్య సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. రోజుకు 800 నుంచి 1000 మంది ఓపీ పేషంట్లు వస్తుండగా 150 నుంచి 200 వరకు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరుతుంటారు. వారిలో ఎక్కువ మంది నిరుపేద గర్భిణులు, బాలింతలతో పాటు వృద్ధులు ఉంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బు పెట్టుకోలేక ప్రభుత్వాస్పత్రిలో చేరే రోగులు.. ఇక్కడ పెట్టే భోజనాన్ని తలుచుకుని వణికిపోతున్నారు. వీళ్ల ఇచ్చే భోజనం కంటే ఆస్పత్రి బయట దాతల సహాయంతో చేస్తున్న అన్నదానంలో బాగుంటోందని రోగులు, వారి సహాయకులు చెబుతున్నారు. అందుకనే పలువురు అన్నదానం నుంచి తెచ్చుకుంటున్నారు. రాత్రిళ్లు హోటళ్ల నుంచి పార్సిల్ తెప్పించుకుంటున్నారు. దీనివల్ల రోగి, సహాయకులకు రోజుకు రూ.150 నుంచి 200 వరకు భోజనానికే ఖర్చవుతోంది. ఇది నిరుపేదలకు భారంగా మారుతోంది.

మెనూ ఇలా..

ఉదయం: మూడు ఇడ్లీలు, చెట్నీ లేదా సాంబారు. కిచిడీ, ఉప్మా, బ్రెడ్ కూడా ఇవ్వచ్చు. అలాగే 150 ఎంఎల్ పాలు ఇవ్వాలి.

మధ్యాహ్నం: 600 గ్రాముల అన్నంతో పాటు 150 గ్రాముల వెజ్ కర్రీ, 200 ఎంఎల్ సాంబారు, కోడిగుడ్డు, 100 ఎంఎల్ పెరుగు లేదా 200 ఎంఎల్ మజ్జిగ, సీజనల్ పండు ఒకటి, చిక్కీ ఇవ్వాలి.

సాయంత్రం: 150 ఎంఎల్ పాలు ఇవ్వాలి

రాత్రి: 600 గ్రాముల అన్నం, 150 గ్రాముల వెజ్‌కర్రీ, 200 ఎంఎల్ సాంబారు, కోడిగుడ్డు, పెరుగు లేదా మజ్జిగ, సీజనల్ పండు ఒకటి ఇవ్వాలి.

మధుమేహ రోగులు కోరిన విధంగా గోధుమ రొట్టెలు అందించాలి. దీంతో పాటు క్షయ, మానసిక రోగులకు అదనంగా పౌష్టికాహారం అందజేయాలి.

భోజనం ఇస్తోందిలా..

ప్రతి రోగికి వైద్య సిబ్బంది సూచన మేరకు శస్త్రచికిత్స జరిగిన వారికి మూడు రోజుల వరకు పాలు, బ్రెడ్డు, ఇడ్లీ, ఉప్మా అందించాలి. సాధారణ రోగులకూ మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి ఇవేవీ అమలు కావడం లేదిక్కడ. ఆకు కూర లేదు, సీజనల్ పండుకు బదులు అరటి పండే ఇస్తున్నారు. నీళ్ల సాంబరు, రసం పేరిట చింత పండు జూస్, రేషన్ బియ్యంతో ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారు. ఇక పాల విషయానికి వస్తే నీళ్లలో పాలు కలిపారా అన్నట్లు ఉందని రోగులు అంటున్నారు. పెరుగు బదులు నీళ్ల మజ్జిగతోనే సరిపెడుతున్నారట. చిక్కీ మాటే లేదు.



ఉడకని అన్నం బాలింత ఎలా తింటుంది?



ఆస్పత్రిలో పెట్టే అన్నం అస్సలు ఉడికేది లేదు. ఆ అన్నాన్ని బాలింత ఎలా తింటుంది? సాంబారు, రసం, కర్రీ అస్సలు బాగోదు. అందుకనే బయట హోటల్లో టిఫిన్ తెచ్చుకొని తింటున్నాం. మాకు హోటల్ ఖర్చే రోజుకు రూ.200 అవుతోంది. తప్పదు కదా ఏం చేసేది?

- వారం కిందట.. పలమనేరుకు చెందిన బాలింత తల్లి ఆవేదన



ఒక్క రోజుకే కడుపునొప్పి

మా అత్తకు అతిసార అని ఆస్పత్రికి తీసుకొచ్చా. వచ్చిన రోజు మధ్యాహ్నం ఆస్పత్రిలో భోజనంతో పాటు తాలింపు పెట్టారు. తిన్న వెంటనే కడుపునొప్పి వచ్చి అల్లాడిపోయా. మా అత్తను చూసుకుందామని వస్తే ఇక్కడ పెట్టే భోజనం తిని నేనే పడుకోవాల్సి వచ్చింది. దీంతో ఐదు రోజులుగా ఆస్పత్రి బయట మధ్యాహ్నం చేసే అన్నదానం నుంచి తెచ్చుకుని తింటున్నాం. ఇక రాత్రికి హోటల్ నుంచి భోజనం తెచ్చుకుంటున్నాం.

- ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొందిన పెద్దపంజాణికి చెందిన రోగి కోడలు జయమ్మ బాధ





క్యూలైన్లలో వేచివున్న జనం - వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కనే ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం.. సమస్యల వలయం

పరిష్కార వేదికకు వెల్లువెత్తిన వినతులు ● పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ

కుప్పం, జూలై 4: అయిదేళ్ల వైసీపీ పాలనలో కుప్పం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇక్కడ ప్రజలు ఎన్నెన్నో సమస్యలతో వేగిపోతూ, పట్టించుకునే దిక్కులేక అల్లాడిపోయారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం కుప్పంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెల్లువెత్తిన జనం దీన్నే రుజువు చేశారు.

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలోని మండల సచివాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించారు. సచివాలయంతోపాటు నియోజకవర్గ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పరిసరాలు కూడా జనంతో నిండిపోయాయి. వీరిని నియంత్రించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. ప్రజల నుంచి 600 వినతులు అందితే వాటిలో ఏకంగా 436 వినతులు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. నియోజకవర్గంలో అయిదేళ్ల పాలనలో ఆ రెవెన్యూ యంత్రాంగం ఎంత భ్రష్టు పట్టిందో ఇది తేటతెల్లం చేస్తోంది. భూ ఆక్రమణలు, భూముల సబ్ డివిజన్ చేయడం, చెరువులు, కుంటలు కబ్జా.. వంటి అనేక సమస్యలు ఉన్నాయి. ఇక, విద్యాశాఖకు సంబంధించి 5, ఆర్టీఐ 2, ఇరిగేషన్ 3, పీడీడీఆర్‌డీఏ 16, మండల పరిషత్తు 15, పౌర సరఫాల శాఖ 18, హంద్రీ-నీవా కాలువ 3, ఈడీబీసీ వెల్ఫేర్ 1, హౌసింగ్ 27, ఆర్ అండ్ బి 2, దేవాదాయ శాఖ 3, దివ్యాంగుల సంక్షేమ శాఖ 3, డిప్యూటీ ఈవో 1, డీఎల్డీవో 3, సబ్ రిజిస్ట్రార్ 1, ఐసీడీఎస్ 1, డ్వామా 2, ఈడీ ఎస్‌ఈ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కల్పన, సైనిక్ వెల్ఫేర్, పీవో ఎస్ఎస్ఏ, మైనర్ ఇరిగేషన్, వ్యవసాయం, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ హాస్టల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలకు సంబంధించి ఒక్కోటి, ఎస్‌ఈ ఈపీఆర్ 29, ఆర్టీసీ 4, రెస్కో 4, పోలీసు శాఖకు సంబంధించి 8 చొప్పున వినతులు అందాయి. తహసీల్దారు క్షేత్ర స్థాయిలో పర్యటించి, సమస్య దగ్గరకే వెళ్లి రెవెన్యూ ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టరు ఆదేశించారు. ఈ ప్రక్రియలో అధికారుల తీరుపై ప్రజలనుంచి మళ్లీ ఏమైనా ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక పెన్షన్లకు అర్హులైన వారిని గుర్తించి మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డీఎల్‌డీవో రవికుమార్, సీపీవో సాంబశివారెడ్డి, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులుతోపాటు నియోజకవర్గ పరిధిలోని అధికార యంత్రాంగం పాల్గొని ఆయా సమస్యలపై కలెక్టరుకు వివరణ ఇచ్చింది. టీడీపీ నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు, పి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న శంకర్‌రెడ్డి

'అమరావతి' కోసం రూ.5,116 విరాళం

రాజధాని అమరావతి నిర్మాణానికి గుడుపల్లె మండలం పొగురుపల్లెకు చెందిన ఎం.శంకర్‌రెడ్డి రూ.5,116 విరాళంగా ఇచ్చారు. కుప్పంలో గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో జేసీ పి.శ్రీనివాసులు, డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాకు బతుకునివ్వండి సారూ!

- సాయం కోసం కలెక్టరుకు గంగమ్మ గుడి మాజీ ఛైర్మన్ కుటుంబ సభ్యురాలి వినతి



అర్జీ చూపుతున్న భాగ్యలక్ష్మి

వైసీపీ నేత, ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం మాజీ ఛైర్మన్ ఎస్.పార్థసారథి కుటుంబం రోడ్డున పడింది. ఛైర్మన్ పదవికోసం వైసీపీ నేతలకు అప్పులు చేసి కప్పం చెల్లించిన ఆయన, చివరకు రైలుపట్టాలపై శవమై తేలారు. ఆదుకుంటామన్న వైసీపీ నేతలు మాట తప్పడంతో పార్థసారథి కుటుంబ సభ్యురాలు భాగ్యలక్ష్మి ప్రభుత్వ సాయం కోసం గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చి కలెక్టర్‌కు వినపత్రం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్థసారథి ఆలయ ఛైర్మన్‌గా పనిచేశారు. కరోనా సమయంలో జాతర జరిపే అవకాశం రాకపోవడంతో అసంతృప్తి చెందారు. 2022లో కేపీ మంజునాథ్‌కు ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆ ఏడాది జాతర జరిపించే అవకాశం తనకు ఇచ్చి.. తర్వాత ఎవరికైనా పదవి ఇవ్వాలని వైసీపీ నేతలను పార్థసారథి కోరినా పట్టించుకోలేదు. అదే ఏడాది ఏప్రిల్ 5న రైలు పట్టాలపై ఆయన శవమై తేలారు. ఆలయ ఛైర్మన్ పదవిని ఆయన వైసీపీ నేతలకు లక్షలు ఇచ్చి కొనుక్కున్నారని ఆ వెంటనే గుప్పుమంది. వైసీపీ నేతలకు డబ్బులిచ్చే క్రమంలో అప్పుల పాలై, ఆ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారని ప్రచారమైంది. ఆమేరకు ఆయన చనిపోయే ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ప్రచారానికి జడిసిన వైసీపీ పెద్దలు పార్థసారథి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తామంటూ ముందుకు వచ్చారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన ఇంటికి వెళ్లి కొంత ఆర్థికసాయం చేశారు. రూ.15 లక్షలు సాయం చేస్తానని ఎమ్మెల్సీ భరత్ హామీ ఇచ్చారు. ఆ హామీలేవీ నెరవేరినట్లు కనిపించడంలేదు. అందుకే భాగ్యలక్ష్మి కలెక్టర్‌ను కలిసి ఆర్థిక సాయం కోసం అర్థించారు. పార్థసారథి రెండు ఇళ్లను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి, రూ.10 లక్షలకు పైగా అప్పులు చేసినట్లు చెప్పారు. అప్పట్లో కలెక్టర్‌కు ఎమ్మెల్సీ భరత్ రాసిన లేఖలో ఈ విషయం స్పష్టంగా ఉంది. కాగా, గంగమ్మ గుడి మాజీ ఛైర్మన్ పార్థసారథి భార్య అయిన భాగ్యలక్ష్మి పేరుతో కలెక్టరుకు ఆమె రాసుకున్న లేఖలో ఆయన అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని, తన కుటుంబం జరుగుబాటుకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం చేయాలని విన్నవించుకున్నారు. మొన్నటిదాకా వైసీపీ ప్రభుత్వమే ఉన్నా, ఆ పార్టీ నాయకులవల్ల అన్యాయమై పోయిన పార్థసారథి కుటుంబానికి కనీస ఆర్థిక సాయం అందకపోవడం, ఆ పార్టీ కార్యకర్తలను ఆలోచింపజేస్తోంది.

హాస్టళ్ల బాగుకు రూ.6.55 కోట్లు అవసరం

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన యంత్రాంగం

చిత్తూరు, జూలై 4: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగుల శాఖల ఆధ్వర్యంలోని 108 వసతి గృహాల మరమ్మతులకు రూ.6.55 కోట్లు అవసరమని అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా హాస్టళ్ల బాగోగులు పట్టించుకోలేదు. దీంతో శిథిలమైన భవనాలు, పెచ్చులూడిన పైకప్పులు, అధ్వాన మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్తగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తొలిరోజే వసతిగృహాల స్థితిగతులపై సమీక్షించి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సంక్షేమశాఖల అధికారులు రూ.6.55 కోట్లు అవసరమని కలెక్టర్‌కు నివేదిక అందించారు. దీనిపై మరోసారి కూడా అధికారులు వసతిగృహాలను పరిశీలించి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కలెక్టరు ఆదేశించారు. దీంతో అధికారుల బృందం మళ్లీ నివేదికల తయారీలో నిమగ్నమయ్యాయి. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనున్నారు.

జగన్‌రెడ్డి పాలన తీరుకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనకూ ఉన్న తేడాను ఈ ఫొటోలు చాటిచెబుతున్నాయి.ఎంతస్థాయి అధికారులైనా ఎమ్మెల్యేలకు అణగిమణిగి ఉండాల్సి వచ్చేది. ఐఏఎస్, ఐపీఎస్ అధికార హోదాలు నాయకుల ముందు తలవంచాల్సి వచ్చేది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. అధికారులకు తగిన మర్యాద ఇవ్వాలని సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెబుతూవచ్చారు. దీంతో అధికారులే కాదు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలూ మారారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



అప్పుడు అయ్యాఎస్!

జనవరి 31: తిరుపతి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశా ఆ వెంటనే అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేసి విధేయతను ప్రకటించుకున్నారు.



ఇప్పుడు ఐఏఎస్!

జూలై 4: తిరుపతి కలెక్టర్‌గా ఎస్. వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కలెక్టరేట్‌కు వెళ్లి, కొత్త కలెక్టర్‌కు శాలువాకప్పి శ్రీవారి జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.చంద్రగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు నాని, ఆదిమూలం కూడా కలెక్టరేట్‌లోనే కొత్త కలెక్టర్‌ను కలిశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పుంగనూరు రూరల్, జూలై 4: అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మునిరాజ(45) 30 ఏళ్ల కిందట పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ పెద్ద గడిదేశికి చెందిన అమరావతిని వివాహం చేసుకుని ఇక్కడ స్థిరపడ్డారు. పంటల సాగుకు జువ్వలదిన్నెతాండాకు చెందిన ఓ వ్యక్తి వద్ద అప్పులు చేశారు. అప్పు ఇచ్చిన వ్యక్తి బుధవారం మునిరాజ ఇంటికి వెళ్లి ఉదయానికంతా డబ్బులు ఇవ్వకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం రాత్రి తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని మృతిచెందారు. ఉదయాన్నే కుటుంబసభ్యులు వెతకడంతో పొలంలోని చెట్టుకు వేలాడుతున్నట్లు గుర్తించి కర్ణాటకలోని బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని తమ సొంత గ్రామానికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు చెప్పారు.

పంచాయతీలకు రూ.1.67 కోట్లు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4: కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పంచాయతీలకు నిధుల రాక ప్రారంభమైంది. గత ప్రభుత్వం పంచాయతీలకు వచ్చే నిధులను వివిధ పథకాలకు మళ్లించిన విషయం తెలిసిందే. అలా నిర్వీర్యమైన పంచాయతీలను కొత్త ప్రభుత్వం పునరుద్ధరించే పనిలో పడింది. గురువారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి త్రైమాసికం కోసం నిధులు విడుదల చేసింది. 695 పంచాయతీలకు వృత్తి పన్ను పద్దు కింద రూ.34,60,172, తలసరి గ్రాంట్ పద్దు కింద రూ.19,87,711 సర్పంచుల జీతభత్యాల రూపేణా రూ.1,16,72,000 మంజూరయ్యాయి. ఈ మొత్తాలను రెండ్రోజుల్లో పంచాయతీల ఖాతాలకు జమ చేస్తామని డీపీవో లక్ష్మి తెలిపారు.

20 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 25 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా కార్వేటినగరంలో 45.2మి.మీ, అత్యల్పంగా శాంతిపురంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పాలసముద్రం 37.2, గంగాధరనెల్లూరు 22.0, పులిచెర్ల 21.0, వెదురుకుప్పం 19.2, విజయపురం 12.8, సోమల 12.8, పుంగనూరు 12.0, పెనుమూరు 11.6, పూతలపట్టు 11.4, నగరి 10.4, సదుం 10.2, చిత్తూరు అర్బన్ 8.0, ఐరాల 7.2, శ్రీరంగరాజపురం 7.2, వి.కోట 6.6, యాదమరి 6.6, బంగారుపాళ్యం 6.2, నింద్ర 5.2, గంగవరం 2.4, చిత్తూరు రూరల్ 2.4, పెద్దపంజాణి 2.2, తవణంపల్లె 2.2, చౌడేపల్లిలో 1.8 మి.మీ వర్షం కురిసింది.

ఢిల్లీకి చేరిన ప్రపంచ శాంతి యాత్రికుడు బషీర్



ఎర్రకోట వద్ద బషీర్

పలమనేరు, జూలై 4: పలమనేరుకు చెందిన ప్రపంచ శాంతి యాత్రికుడు బషీర్ అనే యువకుడు గురువారం ఢిల్లీలోని ఎర్రకోట వద్దకు చేరాడు. బషీర్ 20 రోజుల క్రితం ప్రపంచ శాంతి కోసం పలమనేరు నుంచి లడక్‌కు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ క్రమలో ఢిల్లీ చేరాడు. అక్కడినుంచి లడక్‌కు వెళ్లనున్నాడు. ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నందున బుధవారం తన ప్రయాణాన్ని ఢిల్లీలో నిలిపి వేశానని ఇక్కడి స్నేహితులకు సమాచారం ఇచ్చారు. తాను తీసుకెళ్లిన డబ్బులు ఐపోయాయని తనకు ఎవరైనా ఆర్థిక సాయం అందించాలని ఇక్కడి సోషియల్ మీడియా వారికి బషీర్ విజ్ఞప్తి చేశాడు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 4: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ మణికంఠ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా, పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ పొగాకు నియంత్రణ సంస్థ, రాష్ట్ర ప్రజారోగ్య శాఖ, సంబంధ్ హెల్త్ ఫౌండేషన్ వారి సహకారంతో పోలీసు శిక్షణా కేంద్రంలో పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు సంబంధిత వ్యాధులతో ఏటా రాష్ట్రంలో 48వేల మరణాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో 5,500మంది పిల్లలు ప్రతిరోజూ పొగాకు వాడకాన్ని ప్రారంభిస్తున్నారన్న విషయం ఆందోళన కలిగిస్తోందన్నారు. మత్తుమందును పిల్లలకు ఇచ్చినట్లయితే ఏడేళ్లు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అరీఫుల్లా, డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్, హెల్త్ ఫౌండేషన్ మేనేజర్ ప్రమోద్‌కుమార్,డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

24 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతి

తిరుపతి(విద్య), జూలై 4: రాష్ట్రంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికిగాను ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇస్తూ ఏఐసీటీఈ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని మూడు యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,080.. 21 ప్రైవేట్ కళాశాలల్లో 18,900 ఇన్‌టేక్ అడ్మిషన్లకు, మొత్తంగా 24 కళాశాలల్లో 19,980 ఇన్‌టేక్ అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే తిరుపతి జిల్లా పుత్తూరు ఇప్పతంగలి గ్రామం ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 360 ఇన్‌టేక్ అడ్మిషన్లకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చింది.

ఆక్రమణలో బలిజ 'కమ్యూనిటీ' స్థలం



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బలిజ కులస్థులు

కుప్పం, జూలై 4: చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుప్పంలో బలిజలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ2.46 ఎకరాలను కేటాయించారు. ఈ విలువైన స్థలం దురాక్రమణకు గురైంది. తమ స్థలాన్ని వైసీపీకి చెందిన ఒక నాయకుడు కబ్జా చేశాడంటూ బలిజ కులస్థులు గురువారం కుప్పంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక కుప్పంలో పర్యటించిన సమయంలో బలిజ కులస్థుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు కుప్పం పురపాలక సంఘం పలార్లపల్లె దగ్గర 2.46 ఎకరాలను కేటాయిస్తూ అప్పట్లో జీవో జారీ చేశారు. కమ్యూనిటీ భవనం నిర్మాణంకోసం రూ.కోటి మంజూరు చేశారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ అంశాన్ని పట్టించుకునే నాథులే లేకుండా పోయారు. ఆపైన స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు బలిజ కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించారన్న ఆరోపణలు బయలు దేరాయి. గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దీని గురించే బలిజ కులస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన భూమి దురాక్రమణకు గురైంది కాబట్టి, సదరు స్థలాన్ని సర్వే చేయించి ఆక్రమణలనుంచి కాపాడాలని ఆయనకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

- శాంతిపురం మండలం డొంకుమానిపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 55/2లో పేదల ఇళ్ల స్థలాలకోసం కేటాయించిన భూమి దురాక్రమణకు గురైందని ఎమ్మెర్పీ నాయకుడు దేవరాజ్ మాదిగ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనితోపాటు వెదురుగుట్టపల్లె సర్వే నెంబర్ 34లో 59 ఎకరాల పశువుల మేత బీడు, అమ్మవారి పేట కార్గో ఎయిర్‌పోర్ట్ దళితుల సమస్యలను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. శాంతిపురంలోని శ్మశాన, సంత నిర్వహణకుగాను పాలారు నది స్థలాన్ని కేటాయించాలని కోరారు.
- గుడుపల్లె మండలం శెట్టిపల్లె, కప్పలనత్తం చెరువలను కొందరు కబ్జా చేసి ఇళ్ల స్థలాలు వేశారని గ్రామస్థులు కొందరు ఫిర్యాదు చేశారు. ఆయా చెరువులను కబ్జాదారుల చెరనుంచి విడిపించాలని కోరారు.

కౌన్సిల్ సమావేశాలకు అధికారులు సహకరించడంలేదు

కుప్పం, జూలై 4: కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు అధికారులు సహకరించడంలేదని చైర్మన్ డాక్టర్ సుధీర్ గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో చిన్నచిన్న అభివృద్ధి పనులు నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి వెంటనే కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని కమిషనరును ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్‌తోపాటు వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'అంతిమ సంస్కారం' ఎలా?

నీవానది యేటిఒడ్డు ప్రాంతమే శ్మశానవాటిక ● మృతదేహాలను తీసుకెళ్లాలంటే ఎంత కష్టమో?





శ్మశాన దారిలో బురద కారణంగా ఆపేసిన స్వర్గధామం వాహనం, వ్యాన్‌లో నుంచి ట్రాక్టర్‌లోకి మృతదేహాన్ని మారుస్తున్న మృతుడి బంధువులు

గంగాధరనెల్లూరు, జూలై 4: గంగాధరనెల్లూరులో ఎవరైనా మృతిచెందితే.. అంతిమ సంస్కారాలకు తీసుకెళ్లాలంటే అవస్థలు తప్పడంలేదు. అందుకు గురువారం జరిగిన ఘటనే నిదర్శనం. గంగాధరనెల్లూరుకు శ్మశానవాటికకు స్థలం కేటాయించలేదు. ఏళ్ల తరబడి నీవానది ఒడ్డు ప్రాంతాన్నే శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటున్నారు. నీవానది బ్రిడ్జికి గతంలో ఎగువ భాగంలో కొందరు, దిగువ భాగంలో మరికొందరు అంత్యక్రియలు చేస్తున్నారు. గంగాధరనెల్లూరులోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను బ్రిడ్జిపై నుంచి, శ్మశానవాటికకు వెళ్లే దారి పొడవునా పారబోస్తున్నారు. మరికొందరు పాత ఇళ్లను తొలగించాక వృథా రాళ్లు, మట్టిని, ఇళ్లల్లో నుంచి సేకరించే చెత్తచెదారాన్ని శ్మశానానికి వెళ్ళే దారిపక్కన డంపు చేస్తున్నారు. ఈ చర్యలతో ఆ దారిలో మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే దుర్గంధం భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో గంగాధరనెల్లూరు (దిగవూరు)కు చెందిన ఓవ్యక్తి మరణిస్తే గురువారం అతడి మృతదేహాన్ని స్వర్గధామం వాహనంలో నీవానది యేటి ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆ దారి కొంతదూరం బురదమయంగా మారడంవల్ల మృతదేహం ఉన్న వాహనాన్ని ముందుకు తీసుకెళితే కూరుకుపోతుందని డ్రైవర్ చెప్పారు. అందువల్ల వాహనాన్ని గుంత వరకు తీసుకెళ్లలేమని ఆపేశారు. ఆ బురదదారిలో మృతదేహాన్ని మోసుకెళ్లాలన్నా సాధ్యంకాని పరిస్థితి. చివరకు అక్కడకు వచ్చిన కొందరు సమీపంలోని రాళ్లను తీసుకొచ్చి బురదలోకి వేసి మృతదేహాన్ని తీసుకెళ్ళాలన్నా సాధ్యం కాలేదు. అదే సమయంలో గంగాధరనెల్లూరు పంచాయతీకి చెందిన ట్రాక్టర్ గ్రామంలో సేకరించిన చెత్తచెదారాన్ని డంప్ చేసేసి నీవానదిలో పక్కన పెట్టుకుని ఉంటే ఆ డ్రైవర్‌ను ఒప్పించారు. ఆ ట్రాక్టర్ ట్రాలీలోకి మృతదేహాన్ని మార్చి బురదదారిని దాటించుకుని శ్మశానంలో గుంతవరకు తరలించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు మానసిక వేదనకు గురయ్యారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి గంగాధరనెల్లూరుకు శ్మశాన వాటిక సమస్య తీర్చాలని కోరుతున్నారు. నీవానది యేటిఒడ్డు ప్రాంతాన్ని శ్మశానంగా వాడుతున్న స్థలాన్ని, దారిని ఎత్తుపెంచి ఆ ప్రాంతంలో వ్యర్థాలను డంప్ చేయకుండా చర్యలు తీసుకుంటే ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

శాఖాపరమైన విచారణ వేగిరపరచండి

రెవెన్యూ విశ్రాంత ఉద్యోగుల వేడుకోలు



మీడియాతో మాట్లాడుతున్న జయచంద్ర

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 4: ఉత్త పుణ్యానికి శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల కేసులను త్వరగా పరిష్కరించి ఆదుకోవాలని విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏసీబీ, ప్రభుత్వ ఆస్తులు, ధనాన్ని కాజేసిన కేసుల విషయంలో తాము సహాయాన్ని అర్థించడం లేదన్నారు. కానీ రెవెన్యూ శాఖలో చాలామంది ఉద్యోగులు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండానే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అలాంటి వారు రిటైర్ అయ్యాక ఆర్థికంగా, కుటుంబపరంగా చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కేసుల్లో విచారణాధికారులు త్వరగా విచారణ పూర్తిచేయక పోవడంతో పెన్షన్, ఇతర ప్రయోజనాలు అందక వారి జీవనం అస్తవ్యస్తం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరైతే మతిచలించి తిరుగుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికారులు అత్యంత నిర్దయగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొందరు అధికారులైతే భరించలేని భాషను వాడుతూ.. అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ చర్యలపై విచారణ ఎదుర్కొంటున్నవారు జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, వారి కేసులను సత్వరం విచారించి.. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని విన్నవించారు. ఇప్పటికే అధికారుల చుట్టూ తిరిగి, ప్రెస్‌మీట్లు పెట్టి వయోభారంతో అలసిపోయానని, ఇదే తన చివరి ప్రెస్‌మీట్ అని గద్గద స్వరంతో అన్నారు. సమావేశంలో విశ్రాంత ఉప తహసీల్దార్ పీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజలకు దారివ్వు పెద్దిరెడ్డీ.!

- పబ్లిక్ రోడ్డుకు పెట్టుకున్న గేటు
- తొలగింపునకు జనసేన యత్నం
- అడ్డుకున్న పోలీసులపై ఆగ్రహం





పెద్దిరెడ్డి ఇంటి ముందు రహదారికి అడ్డుగా గేటు, గేటు తొలగించాలని పోలీసులతో జనసేన శ్రేణుల వాగ్వాదం

తిరుపతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసుకున్న గేట్లు తొలగించడానికి జనసేన చేసిన ప్రయత్నం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాధనంతో నిర్మించిన రోడ్డును స్థానికులకు అందుబాటులోకి లేకుండా సొంత ప్రయోజనాల కోసం పెద్దిరెడ్డి వాడుకుంటున్నారంటూ మీడియాలో కథనాలు రావడంతో కిరణ్ రాయల్ నేతృత్వంలో జనసేన పార్టీ శ్రేణులు గురువారం పెద్దిరెడ్డి ఇంటి ముందు ధర్నాకు దిగారు. గేటును తొలగించాలని మున్సిపల్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ తామే తొలగించడానికి పూనుకున్నారు.జనసేన ఆందోళన సమాచారం ముందే తెలుసుకున్న పోలీసులు కిరణ్ రాయల్ తదితరులను పెద్దిరెడ్డి ఇంటి సమీపంలోని బండారు అంజనేయస్వామి ఆలయం వద్ద బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ ఘటనాస్థలానికి రావాలని డిమాండు చేశారు. గేట్లు తెరిపించి అందుబాటులోకి తీసుకురావాలని నినదించారు. దాదాపు గంటపాటు నిరసన చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు రాకపోవడంతో తామే గేట్లు తొలగిస్తామని జనసేన నేతలు కిరణ్ రాయల్, సుభాషిణి తదితరులు బారికేడ్లు తోసుకుని ముందుకు వెళ్లబోయారు. పెద్దఎత్తున మోహరించిన పోలీసులు జనసైనికులను అడ్డుకుని పోలీసు వ్యానులోకి ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గేట్లు తొలగించి రెండు కాలనీల వాసులకు దారి కల్పిస్తామని తాము హామీ ఇచ్చామని, అందులో భాగంగా కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేసినట్లు కిరణ్ రాయల్ చెప్పారు. అయినా పట్టించుకోకపోవడంతో తమ నేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ప్రజలకిచ్చిన మాట కోసం పెద్దిరెడ్డి కోటకు పెట్టుకున్న గేట్లను తొలగించేందుకు వస్తే పోలీసులు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్టు వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వం మారినా పోలీసులు మారరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గేట్లు తొలగించడానికి రెండు రోజులు సమయం కోరడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిశోర్, మనోజ్, సాయి, కుమార్, శేషాద్రి పాల్గొన్నారు.

ఇంజనీర్లు లేకుండా పనులెలా చేస్తారు?

- పుంగనూరులో అర్ధరాత్రి పీఎల్ఆర్ కంపెనీ తారు రోడ్డు నిర్మాణం
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు ● పోలీసుల జోక్యంతో సాగిన పనులు





రోడ్డు పనులను అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు.. ఆ తర్వాత జరుగుతున్న పనులు

పుంగనూరు, జూలై 4: ఇంజనీర్లు లేకుండా రోడ్డు పనులు ఎలా వేస్తారంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. పుంగనూరులో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పీఎల్ఆర్ కంపెనీ వేస్తున్న తారు రోడ్డు పనులను అడ్డుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి చౌడేపల్లె రోడ్డులో గతంలో కాంట్రాక్టర్ తారు రోడ్డు వేసి రెండోలేయర్ బీసీ సెన్సార్ ప్లేవర్ వేయాల్సిఉంది. కొద్ది రోజులుగా పుంగనూరులో వైసీపీకి ఎదురుగాలి వీస్తుండటంతో అసంపూర్తి పనులు అర్ధరాత్రి ముగించాలని భావించారు. ఈ క్రమంలో తారు మిక్సింగ్ టిప్పర్, యంత్రాలు వచ్చి రోడ్డుపని మొదలు పెట్టాయి. దీనిని గమనించిన టీడీపీ శ్రేణులు అర్ధరాత్రి రోడ్డు వేయడం ఏంటని, ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు ఎక్కడ ఉన్నారంటూ, దొంగగా ఎవరూలేని సమయంలో రోడ్డు వేయరాదంటూ పని ఆపాలని అడ్డుకున్నారు. దీంతో రెండు వాహనాల్లో పోలీసులు వచ్చి ఆందోళనకారులకు నచ్చజెప్పి మళ్లీ 11.30 గంటలకు పనులు చేసుకోవాలని సూచించారు. తారురోడ్డు వేసేముందు ఎయిర్‌కంప్రషన్‌తో శుభ్రం చేయాలని, సెన్సార్ ప్లేవర్‌తో వేయాల్సిన రోడ్డు మెకానికల్ ప్లేవర్‌తో వేస్తూ తారు లిక్విడ్ వేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ అధికారులు లేకుండా అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, ఈపనికి ముందే బిల్లు అయిపోయి ఉంటుందనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామని వారు తెలిపారు. ఏదైనా ఉంటే శుక్రవారం చూసుకోండని, వాళ్లు రోడ్డు వేసుకుంటారని చెప్పి పోలీసులు టీడీపీ వాళ్లను పంపేశారు. ఆ తర్వాత చకచకా రోడ్డు పనులు చేశారు.

చంద్రబాబు పోస్టరుకు ఆవు పేడ

- వైసీపీ కన్వీనర్‌పై పోలీసులకు ఫిర్యాదు

శాంతిపురం, జులై4: శాంతిపురం మండలం కడపల్లె సచివాలయం గోడకు అంటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరుకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు ఆవు పేడ పూశారు. ఇది మండల వైసీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి పనేనంటూ టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ కనుమలదొడ్డికి చెందిన దండపాణి వర్గీయులు ఆవు పేడను పూసి అశుభ్రపరిచారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఈ నెల ఒకటిన పెన్షన్ పంపిణీ సందర్భంగా సచివాలయం గోడకు ముఖ్యమంత్రి చంద్రబాబు పోస్టరును అతికించి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. బుధవారం రాత్రి దండపాణి అనుచరులు జన్మదిన వేడుకలు జరుపుకొని హంగామా చేశారు. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు చంద్రబాబు పోస్టరుకు ఆవుపేడ పూయడాన్ని గమనించిన స్థానికులు టీడీపీ నేతలకు సమాచారం ఇచ్చారు. వాళ్లు అక్కడికి వచ్చి.. పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణకు తెలిపారు. దీంతో కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, దండపాణి కోసం పోలీస్ స్టేషన్ వద్దకు ఎమ్మెల్సీ భరత్ రాగా.. సీఎం పోస్టరుకు పేడ పూసి అవమానించిన వ్యక్తికి సపోర్టుగా రావడం సరికాదంటూ టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ, టీడీపీ నేతల మధ్య వాగ్వాదంతో స్టేషన్ వద్ద కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


మృతుడి తల్లి మీనాక్షికి ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

సదుం, జూలై 4: స్థానిక వాల్మీకి వీధికి చెందిన రవి కర్మ క్రియలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు రూ.33వేలు రవి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. తిరుమల శ్రీవారి కళ్యాణ కట్టలో క్షుర కుడిగా పనిచేస్తున్న రవి రోడు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కూటమి నాయకులు అండగా నిలిచారు. మృతుడు భార్య నాగవేణికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, భూమన కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్, చంద్రబాబు, శ్రీకాంత్, అంజనేయులు, మునేశ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి


అగ్నిప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు గంగరాజు తదితరులు

పలమనేరు, జూలై4 : పలమనేరులో ఈ నెల 3వ తేదీ విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పలమనేరు సీపీఐ నాయకులు గిరిధరగుప్తా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విజ్ఞప్తిచేశారు. గురువారం ఆయన గిరిధరగుప్తా ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రన్, ప్రసాద్, రామాంజులు, ధనలక్ష్మి, శ్రీరాములు, సంజయ్ పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ

రామకుప్పం, జూలై 4: రాష్ట్రంలో బీసీలకు అన్నివేళలా అండగా నిలిచింది టీడీపీ నేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పలువురు నాయిబ్రాహ్మణ యువకులు ఆనందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని వర్గాల ప్రజలకు మంచి రోజులు వచ్చినట్టేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ యువకులు మనోహర్, గంగాధరం, శీనప్ప, వంశీ, శరవణ పాల్గొన్నారు.

కుప్పంలో విద్యాభివృద్ధికి చంద్రబాబు విశేష కృషి


ఎస్.గొల్లపల్లె పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న విశ్వనాథ్

రామకుప్పం, జూలై 4: కుప్పం నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి మంత్రిగా, సీఎంగా చంద్రబాబు విశేష కృషి చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్ తెలిపారు. గురువారం వారు లింగాపురం, ఎస్.గొల్లపల్లె ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు నందారెడ్డి, పెరుమాళ్, మునిరెడ్డి, శ్రీనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళి, మురుగేష్, పార్థసారథి, కుమరేష్, జయప్ప, సంపంగి, మంజునాథ్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై దేవదాయ అధికారుల చర్చ


యామగానిపల్లె ధర్మరాజుల దేవాలయం ఆవరణలో ఆలయ అభివృద్ధిపై చర్చిస్తున్న అధికారులు, నాయకులు

గుడుపల్లె, జూలై 4: మండలంలోని ఆలయాల అభివృద్ధిపై దేవదాయ అధి కారులు, నాయకులు గురువారం ఆలయాలను సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు గత నెలలో కుప్పం పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధిపై అంచనా వేసి నివేదిక పంపాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా దేవదాయ శాఖ అధికారులు, నాయకులతో కలిసి ఆలయాలను సందర్శించారు. సంగనపల్లె మల్లప్పకొండ, గుడివంక వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, యామగానిపల్లె ధర్మరాజుల ఆలయాలను సందర్శించి ఆలయాల అభివృద్ధిపై నాయకులతో చర్చించారు. ఆలయాల అభివృద్ధికి సంబంధించిన అంచనా వేసి జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ అధికారులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షులు బాబునాయుడు, మండల వన్నెకుల క్షత్రియ అధ్యక్షులు శ్రీనివాసులు, అరుణాచలం, భానుమూర్తి పాల్గొన్నారు.

వార్డుమెంబరు రాజీనామా

రొంపిచెర్ల, జూలై 4: మండలంలోని జాండ్లవారిపల్లె పంచాయతీ 2వ వార్డు మెంబరు పి.జ్యోతి గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రెడ్డెప్పఆచారికి తన రాజీనామ పత్రం అంజేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడ్డ కార్తీక్

సోమల, జూలై 4: రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. సోమల కొత్తపేటకు చెందిన కార్తీక్ (18), సదుం మండలం తిమ్మానాయనపల్లెకు చెందిన ధనుష్ (18), దిగువ కురవపల్లెకు చెందిన గణేష్ (18) సోమల - ఇరికిపెంట మార్గంలోని మునిరెడ్డిగారి పల్లె రోడ్డు క్రాస్ వద్ద తమ ద్విచక్రవాహనం నిలిపి ఉండగా పుంగనూరు నుంచి టమోటా బాక్సులతో వస్తున్న బొలెరో ఢీకొంది. గాయపడ్డ ముగ్గురు యువకులకు సోమల ప్రభుత్వ ఆస్పత్రికి తర్వాత పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా- నలుగురికి గాయాలు

పుంగనూరు రూరల్, జూలై4: పుంగనూరు - ఆరడిగుంట మార్గంలో దుప్పి అడ్డు రావడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. పుంగనూరు నుంచి ఆరడిగుంటకు ప్రయాణికులను తరలిస్తున్న ఆటోకు దుప్పి ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సిద్ధారెడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప(75) తీవ్రంగా గాయపడ్డాడు. పార్వతమ్మ, సుజాత, డ్రైవర్ సమీవుల్లాలు స్వల్పంగా గాయపడ్డారు. సమీప రైతులు ఆటోను రోడ్డుపైకి తీసుకువచ్చారు. గాయపడిన వారిని డ్రైవర్ సమీవూల్లా పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు, జూలై4 : పలమనేరు ఆర్టీసీ డిపోలో ఈ నెల 5వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం 9959225678 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. డిపో పరిధిలో ప్రయాణికులు బస్సు సర్వీసులకు సంబంధించిన సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలు తెలుసుకుని మెరుగైన సేవలు అందిస్తామని వివరించారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



పలమనేరు, జూలై4 : పలమనేరులో గురువారం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు దహనం చేశారు. పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా రాహుల్ ప్రసంగించడాన్ని ఖండిస్తూ క్లాక్ టవర్ సమీపంలో ఆయన దిష్టిబొమ్మను కాల్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు తాతయ్య నాయుడు, చెంచురెడ్డి, సిద్ధయ్య, ఆంజినేయులు, ప్రకాష్, వెంకటముని, జయపాల్, రంగనాయకులు, జగదీష్, రూపనాథంశెట్టి, మోహన్ పాల్గొన్నారు.

చెరువులు, కాలువల ఆక్రమణలు అరికట్టాలి


జేసీకి శెట్టిపల్లె అక్రమాలను వివరిస్తున్న సర్పంచ్ ఎల్లప్ప

గుడుపల్లె, జులై 4: మండలంలోని శెట్టిపల్లె పంచాయతీలోని చెరువులు, కాలువల ఆక్రమణలను అరికట్టాలని సర్పంచ్ ఎల్లప్ప కోరారు. కుప్పం గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్ నిర్వహించన గ్రీవెన్స్‌లో జేసీ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ భూములను, చెరువులు, కాలువలు, వంకలను ఆక్రమార్కులు ఆక్రమిం చుకొని లేఔట్‌లు చేసి అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జేసీ హామీఇచ్చారు.

136 మంది ఉద్యోగాలకు ఎంపిక



శాంతిపురం, జులై 4: శాంతిపురం ప్రభుత్వ ఐటీఐలో గురువారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూమెంట్ డ్రైవ్‌లో 136 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు.

చంద్రబాబు సీఎం అయ్యారని కాలినడకన తిరుమలకు



శాంతిపురం, జులై 4: శాంతిపురం మండలం సొన్నేగానిపల్లె చెందిన అంజప్ప, సీతారామప్ప, కృష్ణప్ప, వెంకటేష్‌లు చంద్రబాబు సీఎం కావాలని గతంలో మొక్కుకున్నారు. కోరిక నెరవేరడంతో గురువారం గుండు శెట్టిపల్లె నుంచి కాలినడకన వీరు తిరుమలకు బయలుదేరారు.

వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేసిన జేడీ



గంగవరం, జూలై4: మండలంలో జరుగుతున్న అడల్ట్ బీసీసీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టీబీ అధికారి రమేష్‌బాబు తనిఖీ చేపట్టారు. గురువారం మండలంలోని కొత్తపల్లె హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో అందుబాటులో ఉన్న వ్యాక్సిన్, ప్రజలకు వ్యాక్సిన్ వేసే విధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో 50 శాతం వ్యాక్సిన్ పూర్తి చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. జిల్లా టీబి నివారణ అధికారి వెంకటప్రసాద్, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ లతోపాటు పలువరు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అల్లూరి: కలెక్టర్





అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ద్రవిడ వర్శిటీలో అల్లూరికి నివాళులు, పలమనేరులో మున్సిపల్ చైర్‌పర్సన్ నివాళి

కుప్పం, జూలై 4: స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి అందరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయులతో పోరాడి 27 యేళ్ల అతి చిన్న వయసులో అమర వీరుడయ్యా డన్నారు. సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డ్వామా పీడీ రాశేఖర్, డీఆర్డీయే పీడీ తులసి తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిప్రదాత అని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మాధవ నాయుడు పేర్కొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం ఎమినో భవనంలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతా రామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్ర పటానికి నివాళులర్పించారు. సోషియల్ సైన్స్ డీన్ ఆచార్య వెంకటేశా, ఆచార్య కనకరత్నం, ఆచార్య అరవింద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముం డేశ్వరి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ● పలమనేరు బీజేపీ కార్యాలయంలో బీజేపీ పట్టణ కన్వీనర్ తాతాయ్య నాయుడు అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లి పాఠశాలలో హెచ్‌ఎం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరికి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, మాధవన్, రాజేష్‌బాబు, అంజప్ప పాల్గొన్నారు.

సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి గౌతం, అధ్యాపకులు రామకృష్ణ, శివయ్య, శ్రీకాంత్, వెంకటసుబ్బయ్య, నాగరత్న పాల్గొన్నారు.


పుంగనూరులో అన్నదానం చేస్తున్న క్షత్రియసంఘనాయకులు

గంగవరం: స్థానిక కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథంనాయుడు ఆధ్వర్యంలో అల్లూరి చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి పుష్ప, భారతి, కుమారి, యశస్విని, సుశీలమ్మ పాల్గొన్నారు.

పుంగనూరు: మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు సేవలు మరువలేనివని పుంగనూరు క్షత్రియ సంఘ నాయకులు కొనియాడారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు సుబ్రహ్మణ్యంరాజు, భకవత్సలరాజు, సీతాపతిరాజు, రెడ్డెప్పరాజు, ప్రభాకర్ రాజు, సోమరాజు, నారాయణరాజు, చంద్రశేఖర్ రాజు, శంకర్‌రాజు, సతీష్‌కుమార్‌రాజు. హిందూ జాగరణసమితి అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, బీజేపీ నాయకులు రాజారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు. ● మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి మున్సిపల్ కమిషనర్ నరసింహా ప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. డీఈఈ మహేశ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక
దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్


గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్న లక్ష్మి తదితరులు

కుప్పం, జూలై 4: కుప్పం నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయనున్నట్లు దేవాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్న లక్ష్మి తెలిపారు. కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం, గుడుపల్లె మండలం గుడివంకలో వెలసిన వళ్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను సందర్శించారు. అక్కడ ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సహ అధికారులతో కలిసి చర్చించారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనకు వచ్చినప్పుడు ఆలయాల అభివృద్ధికి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దేవాదాయ శాఖ అధికారుల సంద ర్శన జరిగింది. ఆయా అంశాలను పరిశీలించి, అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేసి, తర్వాత కార్యాచరణకు దిగుతామని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ స్థపతి నెహ్రూ, డిప్యూటీ ఈఈ చక్రధర్‌రావు, అసిస్టెంట్ స్థపతి దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవు తెచ్చిన తంటా!
● కుప్పంలో బాహాబాహీ


ఆవు యజమానిని మూకుమ్మడిగా చుట్టుముట్టిన దుకాణదారులు

కుప్పం, జూలై 4: ఒక ఆవు కుప్పంలో గొడవలు సృష్టించింది. కూరగాయల దుకాణ దారుల ఆగ్రహానికి కారణమై తన యజమానిని చితకబాదేలా చేసింది. కుప్పం లోని నేతాజీ రోడ్డులో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ముందు పలువురు చిరు వ్యాపారులు కూరగాయల దుకాణాలు నిర్వ హించుకుంటున్నారు. ప్రతి రోజూ పశువులు గుంపులుగా రోడ్డుమీద పడి, ఈ దుకాణాల వద్దకు వచ్చి కూరగాయలను, ఆకు కూరలను తినేసి నష్ట పరిచేవి. ఈ క్రమంలో ఒక ఆవు గురువారం అక్కడికి వచ్చి కూరగాయల దుకాణాలలో చొరబడి అందిన కూరగాయలను తిన బోయింది. దీంతో దుకాణ దారులందరూ కలిసి ఆ ఆవును బంధించి, పాఠశాల గేటుకు కట్టేశారు. ఆవును వెతుక్కుంటూ యజమాని అక్కడికి చేరుకున్నాడు. తన ఆవును ఎందుకు కట్టేశారంటూ కూరగాయల దుకాణ దారులతో దురుసుగా ప్రశ్నించాడు. అసలే ఆవుకు కూరగాయలు మేత అయిపోయాయని కోపంతో ఉన్న వ్యాపారులు మూకుమ్మడిగా అతడిపై దాడిచేసి పిడిగుద్దులు గుద్దారు. నడి రోడ్డుపైనే ఈ బాహాబాహీ చోటు చేసుకుంది. ఇంతలో అటుగా వచ్చిన పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను విడదీశారు. గొడవకు దిగిన వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పుంగనూరులో జనసేనను పటిష్టం చేయండి
● స్థానిక నేతలతో నాగబాబు


జనసేన నేత నాగబాబును కలసిన పుంగనూరు జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, జూలై4: పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాల్సిన అవసరముందని జనసేన నేత నాగబాబు ఆదేశించినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల రమణ తెలిపారు. మంగళవారం రాత్రి విజయవాడలో రాష్ట్రపార్టీ నేత నాగబాబు, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌లను పుంగనూరు నేతలు కలిసి పార్టీ పరిస్థితిని వివరించి సన్మానించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపున కోసం జనసైనికులు కష్టపడ్డారని అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు విరూపాక్షి, చైతన్యరాయల్, నరేశ్‌రాయల్, హరినాయక్, బాలాజీ నాయక్, వికాష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు



కుప్పం, జూలై 4: కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంను గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించారు. ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంలో గల వసతులను పరిశీలించారు. మైదానాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసులు, టీడీపీ నాయ కులు పీఎస్.మునిరత్నం, డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోరంలేక మండల మీట్ వాయిదా

రొంపిచెర్లజూలై4: రొంపిచెర్ల మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. 8 మంది ఎంపీటీలకు గాను ఒక్కరూ హాజరు కావడంతో ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారి సమావేశాన్ని వాయిదా వేశారు. గురువారం జరగాల్సిన ఈ సమావేశానికి పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజ నీరు, ఆర్టీసీ, విద్యుత్, విద్య, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమం, పశుసంవర్ధక శాఖాధికారులుతో పాటు పంచాయతీ కార్యదర్శులు బొమ్మయ్యగారిపల్లె ఎంపీటీసీ కె.సంపూర్ణమ్మ మాత్రమే హాజరయ్యారు. కొంతమంది అధికారులు సమావేశం ముగిసిన తర్వాత ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీధర్, ఇంజనీర్లు వేణుగోపాల్, ఉమామహేశ్వర్, శిరీషా, ఇందిర, శ్రీనివాసులు, కార్యర్శులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజమే లక్ష్యం


ఎంపీపీ స్కూల్ వద్ద వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

చౌడేపల్లె, జూలై4: టీబీ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒకరు పనిచేయాలని రాష్ట్ర టీబీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక ఎంపీపీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం, పెద్దకొండామారి గ్రామాలలో పర్యటించారు. బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించి వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, సూపర్‌వైజర్ సిద్ధార్థ, డాక్టర్ పూజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థికసాయం



పుంగనూరు రూరల్, జూలై4: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ వృద్ధురాలికి టీడీపీ నాయకురాలు విజయలక్ష్మి ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం పట్టణ సమీపంలోని నక్కబండలో కాపురం ఉన్న గోవిందమ్మ(52) కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు రూ.5వేల నగదు, పండ్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. టీడీపీ కార్యకర్తలు జర్నీ, ఆదెమ్మ పాల్గొన్నారు.

7నుంచి రామకుప్పంలో గంగమ్మ జాతర

రామకుప్పం, జూలై 4: రామకుప్పంలోని దిగువవీధి గంగమ్మ జాతర ఈనెల 7వ తేదీ నుంచి 11వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 7న రైతుసంఘం, 8న జ్యోతినగరవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉయదం అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 9న సజ్జల చెంగారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందన్నారు. 10న రాత్రి గంగమ్మ, సల్లాపురమ్మ పుష్పపల్లకీ సేవ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పుష్పపల్లకీ రోజు మధ్యాహ్నం బ్రాహ్మణ సంఘం వారు అన్నదానం చేస్తారని వెల్లడించారు. 11న వసంతోత్సవం జరుగుతుందని తెలియజేశారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దూరం



డెంగ్యూ నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు రూరల్, జూలై4: ఇళ్ల చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని పుంగనూరు ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూధనాచారి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆస్పత్రి నుంచి ప్రకాశంకాలనీ, బీడీకాలనీ ప్రాంతాల్లో డెంగ్యూ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిగోపాల్ మాట్లాడుతూ దోమల వల్ల జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. వారంలో ఒక రోజు ఇళ్ల వద్ద నిర్మించుకున్న వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయాల్సివుందన్నారు. పగటి పూట దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది భారతి, మధుబాల, నాగేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



కల్లూరు, జూలై 4: పులిచెర్ల మండలం కల్లూరులోని భారతం మిట్టలో కొనసాగు తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. గత నెల 17వ తేదీ ప్రారంభ మైన మహాభారతం ఉత్సవాలు గురువారం దుర్యోధన వధ, పాండవుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి లవకుశ పౌరాణిక వీధి నాటకంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో దుర్యోధనుడి బొమ్మను మట్టితో రూపొందించి పూజలు నిర్వహించారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. భీమసేనుడు దుర్యోధనుడిని వధించి అతడి రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పట్టించే సన్నివేశాల పాత్రలకు జీవంపోశారు. దుర్యోధన వధ సందర్భంగా దుర్యోధన, భీమ పాత్రధారులు ఆలపించిన పద్యాలు, పాటలు ఆహూతులను అలరించాయి. ఉభయదారులుగా కొక్కు వారిపల్లికి చెందిన వంకాయలపాటి ముద్దుస్వామి నాయుడి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

చిత్తూరు, జూలై 4: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరుగుతుందని మేయర్ అముద ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభయ్యే ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్లు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు రసీదు ఇస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్

ఐరాల(కాణిపాకం), జూలై 4: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి గురువారం గుంటూరుకు చెందిన ప్రత్యూషసాయి రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

వరసిద్ధుడి సేవలో అనిల్ రావిపూడి



ఐరాల(కాణిపాకం), జూలై 4: ప్రముఖ సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ ఆయన్ను స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం, జూలై 4: మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి రెండవ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లలిత పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాలను జతచేసి ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కళాశాలలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుదారులకు ఎటువంటి ఇంటర్వ్యూ కార్డులూ పంపరని, పూర్తి వివరాలకు 8639790174, 6303156450, 9494434236, 9177035120, 9885320544లలో సంప్రదించాలని ఆమె కోరారు.

అరిమాని గంగమ్మ హుండీ లెక్కింపు



శ్రీరంగరాజపురం, జూలై 4: మండలంలోని అరిమాని గంగమ్మగుడి హుండీ కానుకలను గురువారం ఈవో తిప్పారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. మార్చి నుంచి జూన్ వరకు రూ.2,24,800 వచ్చినట్లు ఈవో వెల్లడించారు. ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, అర్చకుడు వెంకటచాలపతి పాల్గొన్నారు.

చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈగా మునిచంద్ర



చిత్తూరు రూరల్, జూలై 4: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈగా మునిచంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. పీలేరు డివిజన్ ఈఈగా ఉన్న ఈయనకు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ బాధ్యతలు అప్పగించారు. బుధవారం చిత్తూరు ఆపరేషన్ డివిజన్‌కు రెగ్యులర్ ఈఈగా, పీలేరు డివిజన్‌కు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



విజయపురం, జూలై 4: మండలంలోని ఇళ్లత్తూరుకు చెందిన దివ్యాంగుడు సాయికి పాతార్కాడు టీడీపీ నాయకుడు మునిభాస్కర్‌రాజు వీల్‌చైర్‌ను గురువారం అందజేశారు. టీడీపీ నేత వరదరాజులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి సముచిత స్థానం

గుడిపాల, జూలై 4: పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన వారికి న్యాయం చేస్తామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం గుడిపాల సర్పంచులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. పదవులు ఇచ్చినా, ఇవ్వకున్నా పార్టీ కోసం కష్టపడుతున్న వారి జాబితా తన వద్ద ఉందని, తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ జడ్పీటీసీలు బాలాజీ నాయుడు, సుమతి, సర్పంచులు అరుణ్‌కుమార్, గుర్రప్ప నాయుడు, టీడీపీ నాయకులు జయదేవ నాయుడు, సురేష్, రఘునాథ నాయుడు, మురళీనాయుడు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

గుడిపాల, జూలై 4: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా యూనిట్ ఆఫీసర్ పీర్ సాహెబ్ అన్నారు. గురువారం వసంతాపురం వెల్‌నెస్ సెంటర్ వద్ద డెంగ్యూ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి సంధ్య, హెల్త్ సూపర్‌వైజర్లు విజయ, జెబ, చంద్ర, ఉమ, స్వప్న పాల్గొన్నారు.

మంగమ్మ మృతి పార్టీకి తీరని లోటు



మంగమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 4: మండలంలోని 170 గొల్లపల్లి పంచాయతీ జయరామ్‌పురానికి చెందిన టీడీపీ కార్యకర్త మంగమ్మ(70) మృతి పార్టీకి తీరని లోటని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. గురువారం ఆమె అనారోగ్యంతో మృతిచెందడంతో భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే నలగాంపల్లె పంచాయతీ ఎన్‌పీ నగర్‌కు చెందిన చిరంజీవి మృతదేహానికి నివాళులర్పిం చారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు ఎన్‌పీ ధరణి, కోకాప్రకాష్ నాయుడు, గురజాల చెన్నకేశవులు నాయుడు, కోదండ యాదవ్, ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి, ఎన్‌పీ విక్రమ్, ధనంజయ యాదవ్, కుప్పాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిజిటల్ అసిస్టెంట్లు

బంగారుపాళ్యం, జూలై 4: మండలంలోని 27 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కలిశారు. పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ధరణి, కోదండయాదవ్, కమల్‌నాథ్‌రెడ్డి, హేమచంద్ర నాయుడు, రమేష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

లైసెన్సు లేని వాహనాలు సీజ్ చేస్తాం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నరేంద్ర కుమార్

గుడిపాల, జూలై 4: లైసెన్సు లేకుండా వాహనాలను నడపరాదని, అలాంటివి పట్టుబడితే సీజ్ చేస్తామని ఎస్ఐ నరేంద్రకుమార్ హెచ్చరించారు. మండలంలోని 190 రామాపురం, చీలాపల్లి క్రాస్ వద్ద గురువారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సులు లేని 20 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సాయిలింగేశ్వరుడికి రుద్రాభిషేకం



చిత్తూరు కల్చరల్, జూలై 4: మాస శివరాత్రిని పురస్కరించుకుని గురువారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు రుద్రం, నమకం, చమకం సామూహికంగా పఠించి ప్రార్థించారు. భక్తులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు పూజా ద్రవ్యాలతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా, నగరంలోని పలు ఆలయాల్లో ఆషాడమాస పూజలు నిర్వహించారు.

9న తలనీలాల వేలం

కార్వేటినగరం, జూలై 4: కార్వేటినగరం సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు ఈ నెల 9వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

ఉపాధి పనులను వాడుకోండి



గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

కార్వేటినగరం, జూలై 4: ఎస్సీ, ఎస్టీలు గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ అధికారిణి జాహ్నవి కోరారు. కార్వేటినగరం మేజర్ పంచాయతీ గ్రామసభ గురువారం సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీలో సమస్యలను ఈవో మణి దృష్టికి తెచ్చారు. ప్రాధాన్యతల ప్రకారం పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు. పశువులకు ముందస్తు వ్యాక్సిన్లు వేయించాలని వెటర్నరీ అధికారి రైతులకు సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



నింద్ర, జూలై 4: నింద్రలో గురువారం పరమేశ్వరమంగళం వద్దనున్న అన్నై గౌరీ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నింద్ర టీడీపీ నాయకుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

గ్రావెల్ దందాకు వ్యతిరేకంగా నేడు టీడీపీ ధర్నా

పాలసముద్రం, జూలై 4: వైసీపీ నేతల గ్రావెల్ దందాను వ్యతిరేకిస్తూ పాలసముద్రం పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం ఉదయం 10 గంటలకు ధర్నా చేయనున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు తెలిపారు. మండలంలోని శ్రీకావేరిరాజుపురం అటవీ ప్రాంతాల నుంచి తమిళనాడుకు గ్రావెల్‌ను తరలించేందుకు ఉపయోగిస్తున్న జేసీబీని టీడీపీ నాయకులు పట్టి పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ భారతి కేసు పెట్టకుండా 10 రోజుల పాటు జేసీబీని స్టేషన్ ఆవరణలో ఉంచుకుని గురువారం వైసీపీ నేతకు అప్పగించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా చేస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని శేఖర్ రాజు కోరారు.

డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్) జూలై 4: స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో ప్రవేశం కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలలో ల్యాబ్‌లు, అన్ని సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బ్రాహ్మణపల్లెలో పశువైద్య శిబిరం



వెదురుకుప్పం, జూలై 4: మండలంలోని బ్రాహ్మణపల్లెలో గురువారం పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 275 పశువులకు నట్టల నివారణ, పిడుదుల మందు పిచికారీ చేశారు. గర్భకోశ వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పశుగణాభివృద్ధి ఉప సంచాలకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి, పచ్చికాపల్లం పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి





ఢిల్లీలో అల్లూరి చిత్రపటానికి సీఎంతో కలిసి నివాళులర్పిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు - అల్లూరికి పీవీకేఎన్ విద్యార్థుల నివాళి

చిత్తూరు సిటీ, జూలై 4: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు సీఎం, ఎంపీలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఢిల్లీలో సీఎం చంద్రబాబు, సహచర ఎంపీలతో కలసి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ సీతారామరాజు దేశభక్తి స్ఫూర్తిదాయకమన్నారు. దేశంకోసం ప్రాణాలర్పించిన మహానుభావులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు.

చిత్తూరు (సెంట్రల్) : స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటానికి, ప్రత్యేకించి బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా గిరిజన సంఘాలను సమీకరించడంలో సీతారామరాజు చేసిన కృషిని అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కార్వేటినగరం : నేటి యువత, విద్యార్థులు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సైన్యంపై పోరాడిన మన్యం వీరుడు అల్లూరి అని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



రంగ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చితూరు సిటీ, జూలై 4: కాపు నేత వంగవీటి మోహనరంగాకు టీడీపీ, కాపు సంఘం నేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద వంగవీటి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ మోహనరంగ రాజకీయాలకతీతంగా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారన్నారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, నేతలు డీకే బద్రినారాయణ, ఓఎం రామదాసు, బాలాజీ, వీకే విశ్వనాథ్, ఎస్.రాధాకృష్ణ, రామ్మూర్తి, కోలా కిరణ్, కఠారి కిషోర్, కఠారి గోపి, లీలావతి, ఉదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు : పెనుమూరు బస్టాండులో మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పసుపులేటి రమేష్, పూలశేఖర్, తలారిరెడ్డెప్ప, గంగయ్య, ఢిల్లీబాబు, నిరంజన్‌రెడ్డి, రాజేష్, మున్నా పాల్గొన్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి



నగరిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

నగరి, జూలై 4: నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నగరిలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీలో ప్రమేయమున్న వారందరినీ అరెస్ట్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఏఐటీయూసీ నాయకులు కోదండయ్య, బాషా, సత్తార్, సిరాజుద్దీన్ సంఘీభావం తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాబిన్, రోహిత్, విశాల్, ముని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ వైర్లను తొలగించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ, జూలై 4: నివాసాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన నియోజకవర్గ విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. పలు గ్రామాల్లో నివాసాలపైనే విద్యుత్ వైర్లు ఉన్నాయని, వాటిని గుర్తించి వెంటనే మార్చాలని అన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓల్టేజి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈ హరి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

వెదురుకుప్పం, జూలై 4: బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గొడుగుచింత వద్ద గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం గొడుగుచింత గ్రామానికి చెందిన వెంకటముని(28) బుధవారం సాయంత్రం బైక్‌లో సొంత పని నిమిత్తం వెదురుకుప్పానికి వెళ్లి వస్తున్నాడు. గొడుగుచింత గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టింది. గాయపడిన వెంకటమునిని తిరుపతి రుయాకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈ టీచర్ మాకొద్దు : ఎంఈవోకు గ్రామస్తుల విన్నపం

పాలసముద్రం, జూలై 4: ప్రాథమిక పాఠశాల టీచర్ హేమచంద్ర తమకు వద్దని మండలంలోని నరసింహాపురం పంచాయతీ టీవీఎస్ఆర్‌పురం గ్రామస్తులు గురువారం సర్పంచ్ అమరావతితో కలిసి ఎంపీడీవో రామనాథరెడ్డి, ఎంఈవో రాజేంద్రప్రసాద్‌లకు విన్నవించారు. శ్రీకాళహస్తికి చెందిన హేమచంద్ర ఒకటిన్నర సంవత్సరం క్రితం ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు. బోధన సక్రమంగా చేయడం లేదని, అతని మానసిక స్థితి కూడా సరిగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది ఇదే విషయమై రెండ్రోజులపాటు పాఠశాలకు విద్యార్థులను పంపకుండా నిరసన తెలిపారు. బదిలీ చేస్తామని మండల అధికారులు హామీయిచ్చి గాలికొదిలేశారు. ఈ పరిస్థితుల్లో 90మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 21 మంది మాత్రమే వస్తున్నారు. మిగిలిన వారు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. ఇప్పటికైనా సదరు ఉపాధ్యాయుడిని బదిలీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బేకరీకి నోటీసులు

చిత్తూరు సిటీ, జూలై 4: పాచిపోయిన, నాణ్యతలేని తినుబండారాలు విక్రయిస్తున్న బేకరీకి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గురువారం నోటీసులు జారీ చేశారు. రామ్‌నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో రామ్‌నగర్ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం వెజిటెబుల్ పఫ్ తీసుకున్నాడు. అది తిన్న అతని కుమారుడికి వాంతులు కావడంతో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర సదరు బేకరిలో తనిఖీలు నిర్వహించారు. తినుబండారాలు నాసిరకంగా ఉండటం, ఈగలు ఎక్కువగా కనిపించడంతో నిర్వాహకులపై మండిపడ్డారు. మూడు సంవత్సరాలుగా లైసెన్స్ లేకపోవడంతో బేకరీ యజమానికి నోటీసులు జారీ చేశారు.

అనారోగ్యాన్ని భరించలేక కూలీ ఆత్మహత్య



చిరంజీవి (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 4: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నలగాంపల్లె పంచాయతీ ఎన్‌పీ నగర్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎస్పీ నగర్‌కు చెందిన మొగిలయ్య కుమారుడు చిరంజీవి (41) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది, తన ఇంట్లో మోల్డింగ్ కమ్మికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

పందులను తరలించకుంటే చర్యలు



పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

నగరి, జూలై 4: మున్సిపల్ పరిధిలో పందులను పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మంజునాథ్ గౌడ్ హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులతో ఆయన సమావేశ మయ్యారు. వార్డుల్లో పందులు తిరగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే వాటిని పట్టణం బయటకు తరలించాలని సూచించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీచ్‌టూల్ శిక్షణ ఉపయోగకరం



శిక్షణను పరిశీలిస్తున్న డీఈవో దేవరాజులు

నగరి, జూలై 5: టీచ్‌టూల్ విధానం బోధన వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని డీఈవో దేవరాజులు అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు అందిస్తున్న టీచ్‌టూల్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. టీచ్‌టూల్ విధానం శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలు మెరుగుపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ఏఎంవో పల్లవి, టీచ్‌టూల్ కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రేమ్, విషయ నిపుణులు నాదముని, ఈశ్వరయ్య, కోదండయ్య, శరవణ, వసంత పాల్గొన్నారు.

కిలారిపల్లిలో సినిమా షూటింగ్





పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్న చిత్రబృందం

గుడిపాల, జూలై 4: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారి కిలారిపల్లి సమీపంలో 'శరీరం' అనే తమిళ చిత్ర ఫైటింగ్ సన్నివేశాలను గురువారం చిత్రీకరించారు. జీవీటీ సినిమాస్ బ్యానర్‌పై జీవీ ప్రసాద్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. మరో 15 రోజులు చుట్టుపక్కల ప్రాంతాల్లో షూటింగ్ ఉంటుందని చిత్రబృందం తెలిపింది. హీరోగా దర్శన్, హీరోయిన్‌గా అర్చన నటిస్తున్నారు. షూటింగ్ చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి చూపారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు



ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

నగరి, జూలై 4: గ్యాస్ పుస్తకాలను ఈకేవైసీ చేసుకోవడానికి వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరుతున్నారు. వెలుగు పథకంలో ఉన్న వారికే మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారన్న ప్రచారం ఊపందుకోవడంతో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ముందు వినియోగదారులు క్యూ కడుతున్నారు. కొన్ని గంటల పాటు వేచి ఉండి మరి ఈకేవైసీ చేసుకుని వెళుతున్నారు. కొన్ని ఏజెన్సీల వద్ద ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

అలరించిన దుర్యోధన వధ



కల్లూరు, జూలై 4: పులిచెర్ల మండలం కల్లూరులోని భారతం మిట్టలో కొనసాగు తున్న మహా భారత యజ్ఞంలో భాగంగా గురు వారం దుర్యోధన వధ ఘట్టం అందరినీ అలరించింది. గత నెల 17వ తేదీ ప్రారంభ మైన మహా భారతం ఉత్సవాలు గురువారం దుర్యోధన వధ, పాండవుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి లవకుశ పౌరాణిక వీధి నాటకంతో ముగి శాయి. ఆలయ ప్రాంగణంలో దుర్యో ధనుడి బొమ్మను మట్టితో రూపొం దించి పూజలు నిర్వహించారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశాన్ని భక్తులు ఆసక్తిగా తిలకించారు. భీమసేనుడు దుర్యోధనుడిని వధించి అతడి రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పట్టించే సన్నివేశాల పాత్రలకు జీవంపోశారు. దుర్యోధన వధ సందర్భంగా దుర్యోధన, భీమ పాత్రధారులు ఆలపించిన పద్యాలు, పాటలు ఆహూతులను అలరించాయి. ఉభయదారులుగా కొక్కు వారిపల్లికి చెందిన వంకాయలపాటి ముద్దుస్వామి నాయుడి కుటుంబసభ్యులు వ్యవహరించారు.